జ్యోతిష్పథం

# ఒద్దికతోవున్నవారిని భగవంతుడు కాపాడుతాడు



- డిఎస్సార్

భక్తి ఎక్కడవుంటే అక్కడ అణుకువతనం ఓర్పు మరియు దయ వుంటాయి. నిజమయిన భగవద్భక్తుడు, గొప్పవాళ్ళకు మాత్రమేకాదు, అందరికీ సేవకుడుగా భాసిల్లుతాడు. తన సమస్యలు ఎన్నివున్నా ఇతరులకు సహాయం చేయడంలో వెనుకాడడు.

అంబరీషుడు అనేరాజు విష్ణుదేవునికి గొప్ప భక్తుడు. ఏకాదశినాడు ఉపవాసం వున్నారు. అతని ఎనలేని భక్తికి మెచ్చి, తనే సుదర్శన చక్రాన్ని బహూకరించాడు విష్ణువు. అంబరీషుడు ఉపవాసవ్రతాన్ని కొనసాగిస్తున్నాడు. ఇంద్రుడు దేవతల అధిపతి. ఎక్కడ తన పదవికి భంగం కల్గుతుందేమోనని భయంతో దుర్వాసమునిని రెచ్చగొట్టాడు, అంబరీషుని ఏకాదశి వ్రతాన్ని భంగపర్చమని ఆదేశించాడు. దుర్వాసుడు అంబరీషుని వద్దకు వచ్చాడు. అత్యంత భక్తి శ్రద్ధలతో, చాలా గౌరవప్రదంగా దుర్వాసమునిని ఆహ్వానించాడు. ముందుగా నదికివెళ్ళి స్నానం చేసి వస్తానని వెళ్ళారు.

ఉపవాస వ్రతం విరమించే సమయం సమీపిస్తున్నది. నదికి వెళ్ళిన దుర్వాస మహాముని రాలేదు. భగవంతునికి సమర్పించవలసిన మర్యాదలన్ని పాటించి ఒక ఉద్ధరిణ నీరు తీసుకొని ఉపవాసం విరమించాడు.

దుర్వాసముని స్నానం చేసి తిరిగివచ్చాడు. అంబరీష మహారాజు ఉపవాస విరమణ చేసాడని తెలిసి మహోద్రోగుడయ్యాడు దుర్వాసముని. అసలే పరమకోపిష్టి. ఇష్ట మొచ్చినట్లు తిట్టటం ఆరంభించాడు. ఎన్ని తిట్టినా అంబరీషునిలో చలనం లేదు. ఏమాత్రం నోరు మెదపలేదు. పైగా ఉపవాస విరమణ సమయం మించిపోతున్నదన్న భయంతో విరమణ చేసానని ప్రార్థించాడు, వేడుకున్నాడు. క్షమించమని ప్రార్థించాడు. అయినా దుర్వాసముని కోపం తారాస్థాయికి చేరిందేకాని ఏ మాత్రం అతను క్షమించే సూచనలు కనిపించలేదు. ఒక దెయ్యాన్ని అంబరీషుని మీదకు ఉసిగొల్పారు. దెయ్యం వచ్చింది. తన పని ఆరంభించింది. అంబరీషుని కంఠం తెగేయమని ఆదేశించాడు దుర్వాసుడు.

దెయ్యం సమీపిస్తున్నది అంబరీషుడు సుదర్శన చక్రం ప్రయోగించాడు. సుదర్శన చక్రం బారి నుంచి తనను తాను కాపాడుకోవటానికి, బ్రహ్మ, శివుల వద్దకు పరుగులు తీసాడు దుర్వాసుడు. చివరకు వైకుంఠానికి వెళ్ళాడు. విష్ణుదేవుడు "నీకు విముక్తి కావాలంటే, అంబరీషుని వద్దకెళ్ళు అతన్ని వేడుకోమన్నాడు. అంబరీషుని వద్దకు పరుగుపెట్టి తనను క్షమించమని ప్రార్ధించాడు."

అంబరీష మహారాజు తన మంచితనం, అణకువతనంతో జరిగింది మర్చిపోయి దుర్వాసముని కాళ్ళుకడిగి, ఆ నీళ్ళను త్రాగాడు. అంబరీషుని వంటి రాజుల పక్షాన భగవంతుడు వుంటాడు. భగవంతుడు ఎప్పుడూ మనలను పరిశీలన చేస్తుంటాడు. అందరికన్న నేనే గొప్పవాడిని అని గర్వపడేవారిని, అందరూ నాకు సేవ చేయాలనే అహంబోతులను ఏనాడు రక్షించడు.

భగవంతుని ప్రార్ధిస్తున్నా అనుకునే గర్వపోతులను, యితరుల మీద పగసాధిద్దామనే అహంకారులను ఏమాత్రం క్షమించడు.

హృదయం నిర్మలంగావున్నప్పుడు "భక్తి" మూలాల్లోకి వెళ్తుంది. అప్పుడు మాత్రమే మనలోనే భగవంతుడున్నాడని గ్రహించగలము.

## శ్రద్ధాంజలి



సంతవురిటి దివ్యజ్ఞాన సమాజ అధ్యక్షులు సో॥చందనాల జగన్నాధరావు గారు (డి.నెం.42469) 2-3-2020వ తేదీన స్వర్గస్తులైనారు. వీరికి 98 సంవత్సరములు. కీ.శే. శ్రీజగన్నాథరావు గారి స్మృత్యర్థం వారి కుమారుడు సో॥ సి. రంగారావు గారు రూ. 1000/- లు సంరక్షక విరాళం పంపినారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెల్పుతూ జగన్నాధరావుగారి ఆత్మకు శాంతి కలగాలని జోనల్ కార్యదర్శి కంబాల పాపారావు, సీనియర్ సభ్యులు వడగ అప్పారావు, పొందూరు కార్యదర్శి దండా అప్పారావు సంతవురిటి కార్యదర్శి కేతం తవిటయ్య మరియు సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. వీరి మృతికి దీపిక సంతాపం తెలుపుచున్నది.

# ఉపకారము

**“పరోపకారాయ సతాం విభూతయః”** అంటుంది సుభాషితం. సజ్జనులు సంపాదించే ధనం పరులకే ఉపయోగ పడుతుంది. తాము అనుభవించడానికి కాదు. ప్రకృతి కూడ ఇందుకు సాక్షీ భూతంగా నిలుస్తుంది.

చంద్రుడు ఉపకారం చేయాలనే తలంపుతో కలువల్ని వికసింప జేస్తున్నాడు. ప్రభాతకాలాన సూర్యుడు తన కిరణాలతో తామరలని మేలుకొల్పు తున్నాడు. ఎందుకు ? సత్పురుషుల స్వభావమదే గదా! వారెల్లప్పుడు పరోపకార పరాయణులే.

**“నాభ్యర్థితో జలధరోఽపి జలం దదాతి”** అంటె మేఘాలు యాచించకనే నేలపై నీటిని వర్షిస్తున్నాయి. అలాగే సజ్జనులు స్వయముగా కల్పించుకొని పరహితపరాయణులవుతారు.

**పిబన్తి నద్యః స్వయమేవ నాంభః**
**స్వయం న ఖాదన్తి ఫలాని వృక్షాః ।**
**నాదన్తి సస్యాః ఖలు వారి వారి వాహాః**
**పరోపకారాయ సతాం విభూతయః ॥**

“నదులు స్వయంగా నీటిని త్రాగవు. చెట్లు తమంత తాము పళ్ళని ఆరగించవు. మేఘాలు అడగకనే వానలు కురిపిస్తాయి. సస్యసమృద్ధికి తోడ్పడుతున్నాయి. అలాగే సత్పురుషులు తామార్జించిన ధనాన్ని పరులకే వినియోగిస్తారు. తామనుభ వించడానికి కాదు.”

దయానంద, రాజారాంమోహన్ రాయ్, బుద్ధ, ఏసు, నిఖి, గాంధి, మలయాళస్వామి మొదలైన పుణ్య భాగులు తమ సర్వస్వాన్ని విశ్వశ్రేయస్సు కోసమే ధారపోశారు. వారికి పరోప కారమే జీవితాదర్శం.

శాస్త్ర విజ్ఞానవే చెవులకు అలంకారం. కుండలాల్ని ధరించుటవల్ల కాదు. దాన గుణమే చేతులకలంకారం. కంకణాలు దాల్చుట వల్ల కాదు. అలాగే సజ్జనుల శరీరం పరోపకారంతోనే శోభిల్లుతుంది. చందనాది లేపనాల వల్ల కాదు. “పరోపకార మిదం శరీరమ్”

**యదార్థభారతి సౌజన్యంతో**

# ధరణిని ధరించేతత్త్వమే - ధర్మం!

గీతాంజలి మూర్తి
9849062885

**యేన విశ్వమిదం నిత్యం**
**ధృతం చైవ సురక్షితం**
**సనాతనోక్షరోమస్తు తస్మై**
**ధర్మాయ వై నమః**

అంటే శాశ్వతమూ, అక్షరము. ఐన ఏ నిత్య తత్వం ఈ అనంత విశ్వాన్ని ధరించి సంరక్షిస్తుందో అట్టి సత్య సనాతన ధర్మానికి నమస్కారం. వైదిక ధర్మానికి సనాతన ధర్మమని పేరు. 'సనా భవః సనాతనః' అనగా 'శాశ్వతమైనది' అని అర్థం. ప్రపంచంలోని ఇతర మతాల వలె ఒక వ్యక్తి ద్వారా కాకుండా సత్య సనాతనుడైన పరమాత్మ ద్వారా ప్రవర్తిల్లింది, కనుక సనాతన ధర్మం. అంతే కాక తనను విశ్వసించి అనుసరించే వారిని సనాతనులుగా, పరమాత్మ స్వరూపులుగా చేసేది కావున సనాతన ధర్మం. ఈ విచికిత్స వలన భగవంతుడు, ధర్మమూ భిన్నములు కాదని తేలింది. 'యతో ధర్మః తతో జయః' అంటే 'ధర్మమున్న చోటే విజయ వైభవం ఉంది' అని అర్థం.

ఆర్ష వాఙ్మయంలో సనాతన ధర్మ లక్షణాలు విస్తృతంగా చెప్పబడ్డాయి. మానవ సంఘాన్ని కట్టుబాటులో నిలిపి ఉంచేదే ధర్మమని పెద్దల నిర్ణయం. ఇహంలో సుఖాన్ని, పరంలో మోక్షాన్ని కలిగించేదే ధర్మం. అహింస, సత్యం, అస్తేయం, అపరిగ్రహం, శౌచం, ఇంద్రియ నిగ్రహాలను మానవమాత్రుడు విధిగా పాటించాల్సినవిగా రాజర్షి మనువు పేర్కొన్నాడు. ఇలా 'పద్విధం ధర్మ లక్షణం'. అద్రోహం, అలోభం, బాహ్యేంద్రియ నిగ్రహం, భూతదయ, తపస్సు, బ్రహ్మచర్యం, సత్యం, క్షమ మరియు ధైర్యం – ఈ పది – సనాతన ధర్మానికి మూలభూతగుణాలని మత్స్య పురాణం కథనం.

ఐతే, ఈ మహర్షులు చెప్పిన ధర్మ లక్షణాలలో ఎక్కడా స్థూల బాహ్యపూజ, అర్చనల ప్రస్తావన కనిపించదు. కేవలం నైతిక విలువల పరిగణన, ప్రశంస తప్ప పూజా పాఠాల ప్రసక్తే కనిపించదు. అలాగని స్థూలపూజ ధర్మబాహ్యం కాదు. ధర్మవిరుద్ధం కాదు. ధర్మం వేరు మతాలూ సంప్రదాయాలు ఆచారాలు వేరు. మతాలు అనేకమున్నా ధర్మం

(మిగిలినది 22వ పేజీలో..)

# ఈస్టర్ ద్వీపము - శిల్పాలు

**శ్రీమతి యం.రాజసరస్వతి, గుంటూరు**
సెల్ : 9490541800

అట్లాంటియనులు 27 అడుగుల బొమ్మలు తయారు చేశారు. అవి వారి పరిమాణాలలో వున్నాయి. లెమూరి యనుల భూమి నాశనమయింది. నాల్గవ జాతిని నీరు భయపెట్టింది.

ఈస్టర్ ద్వీపము మీద పెద్దపెద్ద శిల్పాలు, గోబి ప్రాంతాలలో కూడా కన్పించాయి. 27 అడుగుల పొడవు గలిగి, 8 అడుగుల వెడల్పు గల్గి వుండి, అవి మరీ అంతపాతవి కావని ఆధునిక ఆర్కియాలజిస్టులు నిర్ణయించారు. కొన్ని బ్రిటిష్ మ్యూజియంలో వున్నాయి.

అగ్నుల కారణంగా లెమూరియా నశించాక పరిమాణాలు క్రమంగా తగ్గి 6 లేక 7 అడుగులకు మారి, ఇండియా చైనా వారు ఇంకా పొట్టిగా మారారు.

ఈ రికార్డులన్నీ ఎలా నిలువ వుంచారన్నది ప్రశ్న. హిందువులకు గ్రీకులు తీసుకువచ్చేవరకు "రాశుల" గురించి కూడా తెలియదని అభిప్రాయం చాలా మందికి వున్నది. లెమూరియా మునగటము "నార్వే" ప్రాంతము నుంచి మొదలైంది. మూడవ మూలజాతి "లంక"లో అంతమైంది. మనం ఇప్పుడు పిలుస్తున్న లంక ఒకనాటి మిగిలినలంక ఉత్తర ప్రాంతము.

మూడవ మూలజాతి ఊయలగా పిలువబడే లెమూరియా పసిఫిక్, హిందూ మహాసముద్రాలనేకాక, గుర్రపు నాడా ఆకృతిలో మెడగాస్కర్, South Africa ల చుట్టూ తిరిగి అట్లాంటిక్ అంచు నార్వే వరకూ వ్యాపించింది. English మంచినీటి నదిగా Wealden ఉత్తర లెమూరియా ప్రాంతము. ఆస్ట్రేలియా, యూరప్‌లు కూడా ఒకనాటి లెమూరియా భాగాలేనని శాస్త్రజ్ఞులు అంగీకరించారు. అట్లాంటిక్ సముద్రంలో 9000 అడుగులు పైకిలేచిన భాగము, బ్రిటిష్ ద్వీపాల నుంచి దక్షిణంగా, దక్షిణ అమెరికా వరకు వెళ్ళి, తూర్పు దక్షిణంగా లేచి హిందూ మహాసముద్రం వరకూ వుంది. ఇది అట్లాంటిక్ ఖండ మిగిలిన భాగము.

అట్లాంటియనులు N. లెమూరియన్ 3వ జాతి నుంచి ఏర్పడి, వాక్కు నేర్చుకున్నారు. అట్లాంటిస్ ఖండము అనేక ద్వీపాలు, పెనిన్సులాలు కలిసి

తయారై అట్లాంటియనులకు ఆవాస మయింది.

అన్ని నాగరికతలకంటె ఈజిప్టు పురాతనమైనదిగా భావిస్తున్నారు. లెమూరియన్ నాగరికత గురించి, దాని పెరుగుదల, సాంఘిక, రాజకీయ అభివృద్ధికి చెందిన రికార్డులు కూడా వున్నాయి. కానీ అవి అర్థమయేస్థితిలో లేవు. భాష, "7 Keys of Symbols" అర్థం అవాలంటే

1. వాటి గురించిన నిజభావము.
2. దానిలో నిగూఢంగా వున్న విషయము.
3. శుద్ధ స్వరూపము, దివ్య స్వరూపము.

ఇన్ని తెలిస్తే కాని అవి అర్థము కావు.

పురాతన గ్రంథాలలో కథలలో చెప్పటం అన్నది లేదు. గుర్తుల రూపంలో గానీ, భావాలను ప్రకటించటము, వేదాలలో, Bible లో, Book of Dead లోనూ కథలు లేవు.

వైవస్వత, గ్జిస్యురోస్, నోవా అన్నీ ప్రపంచ ప్రళయాలు, భౌగోళిక, పాక్షిక, రాసులకు చెందిన, విశ్వప్రళయాలు ఇవన్నీ చరిత్రలో వున్నాయి.

ఇండియాలో దానవులు, లంకలో రాక్షసులు, గ్రీకుల టిటన్లు, ఈజిప్టు హెరోలు, అన్ని జాతులలోనూ 27 అడుగుల giants వున్నారు.

ఈస్టర్ ద్వీపము ద. అమెరికా తీర ప్రాంతము నుంచి 2000 మైళ్ళ దూరంలో వుంది. 12 మైళ్ళ పొడవు, 4 మైళ్ళ వెడల్పున దానిలో Crater 1050 అడుగుల ఎత్తున కేంద్రంలో వుంది. ఈ ద్వీపము చుట్టూ Craters వున్నవి. వాటి క్రియాత్మకత లేదు గానీ, అవశేషముగా వున్నాయి. దానిలో బహుశా పాలినీషియనులు వుండి వుంటారు. వారు పనితనంలో చాలా నేర్పరితనం కలవారు. ''పెరు'' స్థానికులు, వుండి వుండవచ్చు.

ఈ శిల్పాల క్రింద సూర్యుని నుంచి రక్షణ పొందవచ్చు. 'పెరు' దేవాలయ గోడల్లోని రాళ్ళకు, ఈ విగ్రహాలకుపయోగించిన రాళ్ళకు పోలిక వున్నది. పొడవు తలలు, ముక్కులు, నోళ్ళు, తలకు ధరించిన పాగాలు, చాలా వైవిధ్యం కన్పరుస్తున్నాయి. చాలా పెద్ద పరిమాణాలలో, కొంచెం కొంచెంగా నిర్మించారా, ఒకసారే నిర్మించారా అన్నట్లు చాలా పెద్దవిగా వున్నాయి. న్యూయార్కులోని "Statue of Liberty" అన్నింటిలోకి అదే చిన్నది.

C.Asia లో కూడా కొన్ని అటువంటి విగ్రహాలు కన్పడ్డాయి.

హిందూకుష్ పర్వతప్రాంతంలో సముద్రాలకు 8500 అడుగుల ఎత్తున కన్పించాయి. చంఘిజ్ఖాన్ 8వ శతాబ్దంలో వీటిని నాశనం చేసినట్లు దాఖలాలున్నాయి.

బౌద్ధారామాలు, విహారాలను హ్యూయెన్‌సాంగ్ గమనించాడు. అక్కడి విగ్రహాలు 173 అడుగుల ఎత్తు, 70 అడుగులు న్యూయార్క్ విగ్రహం కన్నా ఎక్కువ గలిగినవి వున్నాయి. న్యూయార్క్ విగ్రహము 105 అడుగులు లేక 32 మీటర్లు ఎత్తు వున్నది. బుద్ధ విగ్రహాల పెద్ద చెవులు, క్రిందికి సాగిన చెవులు జ్ఞానలక్షణాన్ని, అన్ని శబ్దాలను వినగలిగిన లక్షణాన్ని సూచిస్తాయి. గౌతమబుద్ధుడు ఆర్యన్ హిందువు. C.Asia లో కన్పించిన 5 విగ్రహాలు మానవ జాతిపరిణామానికి నిదర్శనలుగా నిలిచాయి.

1 – 1వ జాతికి,

2వది 120 అడుగుల ఎత్తుని స్వేదజాతికి,

3వది 60 అడుగులు భౌతిక జాతికి (తల్లి తండ్రులకు పుట్టిన జాతికి) 20 నుండి 25 అడుగున లెమూరియా జాతికి,

4వది – 5వ జాతికి నిదర్శనగా చిన్నదిగా ఏర్పడింది.

## జన్మదిన శుభాకాంక్షలు



దివ్యజ్ఞాన సమాజము సభ్యులు, తెలుగు సమాఖ్య కార్యదర్శి శ్రీ జి. సుబ్రహ్మణ్యం గారి కోడలు డా॥ మహేష్‌గారి సతీమణి శ్రీమతి బి.జ్యోతి (డి.నెం. 92784) జన్మదినం జూలై నెలలో జరుపుకొన్న సందర్భంగా వీరికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతోంది దీపిక.

# ఇతరులకుచేసే సేవ మన ఉన్నతికే!

– అమిరపు నటరాజన్

ఒక ఆశ్రమంలో ఇద్దరు ఋషి కుమారులు ఉండేవారు. వారి పేర్లు శౌనకుడు, అభిప్రతారి. వారు వాయు దేవుణ్ణి పూజించేవారు. ఒకరోజు మధ్యాహ్నం వారు భోజనం చేయబోయే ముందు ఎవరో వాకిలి బయట నిలబడి ఆహారం కావాలని భిక్ష అడగడం వినిపించింది. వారు మరో ఆలోచన లేకుండా అతణ్ణి పొమ్మన్నారు.

నిజానికి అలా ఆహారం కావాలని కోరింది ఒక సాధువు. అతనికి చిన్న వయుస్సులోనే బ్రహ్మజ్ఞానం ప్రాప్తించింది. ఈ విధంగా పొమ్మని చెప్పించుకోవడం అతనికేమీ కొత్తకాదు. కానీ వారు ఋషి కుమారులై ఉండీ అలా అనడం అతనికి ఆశ్చర్యం కలిగించింది. వారికి ఒక గుణపాఠం నేర్పాలని అతడు అనుకున్నాడు.

అందువల్ల 'మీరు ఏ దేవుణ్ణి ఉపాసిస్తూ ఉంటారు?' అని ఆ ఋషి పుత్రులను అడిగాడు. 'మేము వాయు దేవుణ్ణి ఉపాసిస్తాం. ఆయనకు మరో పేరు ప్రాణం!' అని వారు గర్వంగా సమాధానం చెప్పారు.

అప్పుడు ఆ సాధువు ''ఓ మహర్షులారా! ఈ ప్రపంచం యావత్తూ ప్రాణం వలనే రూపుదాల్చిందనీ, తిరిగి ప్రాణంలోనే లయమవుతుందనీ మీకు తెలుసనుకుంటాను. కాబట్టి ఈ చరాచర సృష్టి అంతా ప్రాణస్వరూపమని మీరు ఒప్పుకుంటున్నారు! అవునా ?'' అని అడిగాడు.

'అవును, మాకు ఆ విషయం తెలుసు. ఈ విశ్వమంతా ప్రాణంతో నిండివుందని భేషుగ్గా తెలుసు. మాకు తెలిసిన విషయాన్నే నీవు మళ్ళీ చెబుతున్నావే!' అని వారు అసహనంగా జవాబిచ్చారు. 'మరి మీరు ఇప్పుడు వండిన భోజనాన్ని ముందుగా ఎవరికి నివేదించి స్వీకరిస్తారు ?' అని ఆ సాధువు ప్రశ్నించాడు. 'మేము ఆరాధించే వాయు దేవుడికే నివేదిస్తాం' అని వారు బదులు పలికారు.

అది విని ఆ సాధువు, 'ఈ విశ్వమంతా ప్రాణంతో నిండివుందని ఇంతకు పూర్వమే మీరు ఒప్పుకున్నారు. ఆ ప్రాణం కోసమే మీరు నైవేద్యాన్ని తయారుచేశారు. నాలో కూడా ప్రాణం


ఉంది కాబట్టి, ఈ విశ్వంలో నేనూ ఒక భాగమే. ఈ ఆకలితో ఉన్న సాధువు రూపంలో కూడా ఆ ప్రాణమే మిమ్మల్ని భిక్ష అడుగుతోంది కదా!' అన్నాడు.

ఋషిపుత్రులు, 'ఈ వివరణ చాలా బాగుంది. నీవు చెప్పింది ముమ్మాటికీ సత్యం!' అని మెచ్చుకున్నారు. 'మరి నాకు భిక్ష ఇవ్వకుండా పొమ్మనడమంటే, నాలోని ప్రాణాన్ని, అంటే వాయుదేవుణ్ణి పొమ్మనడమే కదా!' అని ఆ సాధువు ఎత్తిపొడిచాడు.

అప్పుడు ఆ ఋషిపుత్రులకు జ్ఞానోదయమైంది. సాదరంగా ఆ సాధువుని లోనికి ఆహ్వానించి అతనికి భోజనం పెట్టారు.

ఈ సృష్టి అంతా భగవంతునితో నిండివుంది. మనం ఈ విషయాన్ని అనుక్షణం గుర్తుపెట్టుకొని మసలు కోవాలి. తోటివారికి సహాయపడటం ద్వారా మనం ఆ పరమాత్మకే సేవ చేస్తున్నాం. అంతేకాక తోటివారికి సేవ చేయడం ద్వారా మనకు మనమే సేవ చేసుకున్నవారమవుతాం.

## శ్రద్ధాంజలి



శ్రీ మెరికపూడి సీతాపతిరావు గారు ది.1, జులై, 2020న స్వర్గస్తులైనారు. వీరు ఎంతో సౌమ్యులు, సాంప్రదాయ బద్ధంగా ఉండే వ్యక్తి, వారు శ్రీకృష్ణదివ్య జ్ఞాన సమాజం, గుంటూరులో ఎన్నో కార్యక్రమాలలో పాల్గొని, వక్తగాను, పిల్లల పోటీలలో జడ్జిగాను మరియు ఎన్నో విధాలుగా సమాజ సభ్యులు కోరినప్పుడల్లా వారి సహాయ సహకారాలు అందించారు. అలాగే దివ్యజ్ఞాన దీపిక పాఠకులకు కూడా వీరు రచయితగా పరిచయస్తులు. వీరు రచించిన సరళీకృత బోధనలు, దివ్యజ్ఞాన సమాజము, ధీరహృదయ బ్లావెట్స్కీ, ఆల్కాట్ ఉదంతాలు మొదలైన వ్యాసాలు దీపికలో ముద్రితమైనాయి. వీరి మృతికి దీపిక సంతాపం తెలుపుతూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

# 'ఓం నమో భగవతే వాసుదేవాయ'

సేకరణ : బండారు భాగ్యలక్ష్మి, నరసాపురం
సెల్ : 9963893525

(గతసంచిక తరువాయి)

**శ్రీభగవానువాచ :**

**శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్**
**జ్ఞానయజ్ఞః పరన్తప**
**సర్వం కర్మాఖిలం పార్థ**
**జ్ఞానే పరిసమాప్యతే**

(అ.4, శ్లో. 33)

**తాత్పర్యము :**

ఓ అర్జునా! ద్రవ్యము వలన సాధింపబడు యజ్ఞము కంటె జ్ఞాన యజ్ఞము శ్రేష్ఠమైనది. ఏలయనిన, సమస్తకర్మమున్ను నాశనముకానిదగుచు (ఫలసహితముగ) జ్ఞానము నందే పర్యవసించుచున్నది (అంతర్భూతమగు చున్నది).

**వ్యాఖ్య :** జ్ఞానయజ్ఞమనగా తత్త్వవిచారణ, తత్త్వం పదార్థ శోధనము, ఆత్మానాత్మ వివేకము, దృగ్దృశ్యవివేచనము, శ్రవణ మనన నిది ధ్యానములు, ఇంద్రియ మనోనిగ్రహము, వాసనాక్షయము మున్నగునవి. ద్రవ్యయజ్ఞములనగా, ధన, ధాన్య వస్తువులచే సాధింపబడు సత్కార్యములు మున్నగునవి. ద్రవ్య యజ్ఞములకంటే జ్ఞాన యజ్ఞము ఉత్కృష్టమైనదని ఇచట చెప్పబడెను ఏలయనగా, ప్రతి జీవి యొక్క చరమ లక్ష్యము మరచిపోయిన తన నిజ స్వరూపమును తిరిగి జ్ఞాపకము పెట్టుకొనుటయే యగును. అనగా ఆత్మజ్ఞానమని అర్థము. తక్కిన అన్ని సాధనలున్ను, అన్ని పరమార్థ కర్మలున్ను తుట్టతుదకు ఆ జ్ఞాన రూప లక్ష్యమునే పొందింపజేయును. వాని ఫలితము లున్ను జ్ఞానము యొక్క మహాఫలమగు బ్రహ్మానందమునందే యిమిడి యుండును. కాబట్టి జ్ఞాన యజ్ఞము సమస్త ఇతర యజ్ఞముల కంటెను, ఇతర (పరమార్ధ) కర్మల కంటెను సర్వ శ్రేష్టమని వచింపబడినది.

జ్ఞానమే అన్ని కర్మల యొక్క పరాకాష్ఠ. అయితే తక్కిన సాధనలు, కర్మాదులు వ్యర్థములు కానేరవు. అవి జీవునకు చిత్తశుద్ధిని కలిగించి జ్ఞాన ప్రాప్తికి దోహదమును కలుగజేయును. కర్మమంతయు జీవుని జ్ఞానము యొద్దకు చేర్చి తదుపరి 'నది సముద్రము నందు

లయించునట్లు' జ్ఞానమందు లయించి పోవును. 'జ్ఞానపరిసమాప్యతే' అను వాక్యము యొక్క అర్థమిదియే దీనిని బట్టి సముద్రమునందు నది అంతర్భూత మైనట్లు జ్ఞానమందు సమస్తకర్మలు, కర్మ ఫలములు, అంతర్భూతములైయే యుండునే కాని నశింపవని భావము చేసిన సత్కర్మ ఎన్నటికీ వ్యర్థము కాదు కనుకనే కర్మ 'అఖిలం' (సత్) = 'నాశనము కానిదగుచు, నిశ్శేషముగ, ఫలసహితముగ' జ్ఞానమందు పర్య వసించుచున్నదని ఇట్లు చెప్పబడినది.

కాబట్టి ప్రతివారును జ్ఞానమును పొందుటయను లక్ష్యముగల్గి తత్ప్రాప్తికై కర్మాదులను సహాయముగ గైకొన వలెను. ఏ సాధనయైనను, ఏమార్గ మైనను, ఏ సంప్రదాయమైనను కడకు జ్ఞానోదయమే చరమస్థితిగా కల్గి యుండును. ఏదియో ఒక సమయమున అట్టి జ్ఞానమును పొందియే మోక్షము పొందవలసి యుందురు. (జ్ఞానాదేవతు కైవల్యమ్) ఈ శ్లోక మందు కర్మ సాధనగను, జ్ఞానము సాధముగను నిరూపించబడినది. కర్మజీవుని జ్ఞాన సౌధము వరకు తీసుకొనిపోయి అచట వదలును. అటు పిమ్మట జ్ఞానమే వానిని సౌధాగ్రమగు మోక్షస్థానమునకు చేర్చును దీనిని బట్టి జ్ఞానమనునది అకస్మాత్తుగా లభించు వస్తువు కాదనియు, పరమార్థకర్మలు చేయుచూ రాగా రాగా చిత్తశుద్ధి జనింప, తదుపరి ఉదయించు స్థితియని తేలుచున్నది. కావున సత్కర్మలు జీవునకు మోక్షప్రాప్తికై అవసరములని స్పష్టమగుచున్నది. నిరంతర దైవచింతనచే, సత్కార్యాచరణ ముచే, భగవదారాధనచే భగవానుడు కరుణించి జీవునకు జ్ఞానమును (బుద్ధి యోగము) ప్రసాదించును. దాని చేతను అతడు ముక్తినొందును.

కాబట్టి జ్ఞానమును లక్ష్యముగ పెట్టుకుని, లక్ష్యసాధనకై కర్మనాచ రించుచు రావలెను. ఒక వేళ సాధ్య వస్తువును పొందినను లోక సంగ్రహార్థం పెక్కురు మహాత్ములు కర్మను వదలక ఆచరించుచునే యుందురు. ఈ శ్లోకము నందు జ్ఞానము యొక్క శ్రేష్టత్వము, కర్మము యొక్క ఆవశ్యకత రెండును ప్రతిపాదింపబడినవి.

**నహి జ్ఞానేన సదృశం**
**పవిత్రమిహవిద్యతే**
**తత్స్వయం యోగసంసిద్ధః**
**కాలే నాత్మని విన్దతి**

(అ.4, శ్లో.38)

**తాత్పర్యము :** ఈ ప్రపంచమున జ్ఞానముతో సమానముగ పవిత్రమైనది

ఏదియును లేదు. అట్టి జ్ఞానమును (కర్మ) యోగసిద్ధిని బొందినవాడు కాలక్రమమున తన యందే స్వయముగ పొందుచున్నాడు.

**వ్యాఖ్య :** ఈ ప్రపంచమున పవిత్రమైన వస్తువు లెన్నియో కలవు. కాని వాని యన్నింటి కంటెను పరమ పవిత్రమైనది జ్ఞానవేు యని యిటవచింపబడినది. మనుజులు పునీతనమొనర్చుటలో జ్ఞానమునకు మించినది మరియొకటి లేదు. అది జీవుని అజ్ఞాన రూప మాలిన్యమును బోగొట్టి ఆత్మానుభూతిని కలుగ జేయును.

దేవుని స్థూలదేహమునకు సంబంధించిన కల్మషమును బోగొట్టుటకు సబ్బు, సీకాయ, కుంకుడు కాయ, నీరు మొదలైన వస్తువు లెన్నియో కలవు. అట్లే సూక్ష్మ దేహమగు చిత్తమునకు పట్టిన మాలిన్యమును నిర్మూలించుటకు, కర్మ, ఉపాసన, ధ్యానము, యోగము, జ్ఞానము మున్నగు సాధనములు అనేకములు కలవు. వాని యన్నిటిలో జ్ఞానమే సర్వశ్రేష్టమని భగవానుడు వచించుచున్నాడు. అయితే ఆ జ్ఞానమెట్లు లభించును ? స్వకీయ ప్రయత్నము చేతనే తన్నుతానే యుద్ధరించుకొనవలెను. తన యాకలిని తానే తీర్చుకొనవలెను. గురువులు, దైవము, పెద్దలు సహాయము మాత్రము చేయుదురు, నడువవలసినదితానే. అనుభవించవలసినది తానే స్వ ప్రయత్నము చేతనే జ్ఞానమును సముపార్జించవలెను. కనుకనే 'స్వయమ్' అనుపదము ప్రయోగించబడినది. 'యోగ సంసిద్ధః'జ్ఞానమును పొందుటకు ముందుగా యోగ సంసిద్ధుడు కావలెను. అనగా కర్మ యోగమందు ఆరితేరవలెను నిష్కామ కర్మమును బాగుగా అనుష్ఠించుచు వచ్చి చిత్తశుద్ధిని పొందవలెను. వస్త్రమునకు మురికి పోయిన తరువాతనే రంగు అంటునట్లు నిష్కామకర్మ సాధన చతుష్టయ సంపత్తి మున్నగు చిత్తశుద్ధికర యత్నములచే హృదయము నిర్మలమైనపుడే జ్ఞాన ముదయించును. అయితే ఆ జ్ఞాన మెచట ఉదయించును, తన యందే తన హృదయమందే జ్ఞానము వ్యక్తమగునుగాని వేరొక చోటకాదు అది ఇంకొకడు అనుభవించు వస్తువుకాదు తనకు తానే అనుభవించును. కనుకనే "ఆత్మని" అని ప్రయోగింపబడినది "కాలేన" – కాలక్రమమున (కర్మ యోగమందు సిద్ధిని పొందినవెనుక) జీవునియందు అది ఉదయించును. "మోక్షమెపుడు సిద్ధించును ? జ్ఞాన

మెపుడు కలుగును ? అను ప్రశ్నలకు భగవానుడిచ్చుట చక్కని సమాధాన మొసంగెను. మోక్షమునకు కాల నియమము లేదు. చిత్తమెపుడు పరిపక్వమగునో అపుడే అది లభించును. వారి వారి సాధనల యొక్క తీవ్రతను బట్టి కొందరికి శీఘ్రముగను, మఱికొందరికి చిరకాలమునకు అది చేకూరును. కావున మోక్షవిషయమై, జ్ఞాన విషయమై ఎవరును నిరుత్సాహ పడవలసిన పని లేదు. వారి వారి ప్రయత్నాతిశయమును బట్టి కాల క్రమమున సర్వులకును జ్ఞానము లభింపగలదు. శిశువు జన్మించవలె ననిన తల్లి తొమిది నెలలు ఓపికపట్ట వలెను కదా! కాబట్టి సహనము గల్గి, నిశ్చల మనస్సుతో నిష్కామ కర్మ యోగాది సాధనలు అవలంబించి హృదయ నిర్మలత్వమును సంపాదించినచో జ్ఞానము దానంతట అదియే భగవదనుగ్రహముచే జీవుని యందు వ్యక్తమగును.

**(సశేషము)**

*(గీతామకరంద రచయిత శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామివారి నిత్యస్మరణీయ గీతావాక్యములు కొన్ని యధాతథంగా.)*

## శుభాకాంక్షలు

విజయవాడ దివ్యజ్ఞాన సమాజ సభ్యులైన శ్రీ వి.సురేష్ గారు తమ



స్వగృహంలో 'యూనివర్సల్ కౌన్సిలింగ్' సెంటరును ప్రారంభించినారు.

ఈ సందర్భంగా దివ్యజ్ఞాన దీపిక అభివృద్ధిని కాంక్షిస్తూ దీపికకు రూ.1,116-00 విరాళం అందజేస్తారు. వీరి ఫోన్ నెం.9490915893. వీరి కౌన్సిలింగ్ సెంటరు అభివృద్ధి చెందాలని కాంక్షిస్తూ దీపిక కృతజ్ఞతలు మరియు శుభాకాంక్షలు తెలుపుతున్నది.

# 1875కి పూర్వం H.P. బ్లావట్స్కీ

**రచన : గుడిసేవ మురళీధర్,** బందర్
సెల్ : 9573536110

నిరంతర కాలగమనంలో ఎన్నెన్నో జరుగుతుంటాయి. రాజకీయాలతో ఏమీ సంబంధం లేని వ్యక్తి ముఖ్యమంత్రిగానో, ప్రధానమంత్రిగానో కూర్చోవచ్చు. నటనలో ఏమీ అనుభవంలేని ఒక మహిళ పెద్ద స్టార్‌గా పేరు పొందవచ్చు. ప్రపంచంలోని రోడ్లన్ని నిర్మానుష్యంగా కొన్ని వారాలు లేదా నెలలు ఉండవచ్చు. ఇలాంటిదే బ్లావట్స్కీ అనే వ్యక్తి పేరు థియోసాఫికల్‌సొసైటీలో ప్రపంచంలోని 70 దేశాలలో వినబడుతుండటం. అతను 1809లో ఉక్రెయిన్ దేశంలో జన్మించారు. నికోఫర్ బ్లావట్స్కీ అని అతని తల్లిదండ్రులు పేరు పెట్టారు. వీరు 75 సం॥ జీవించారు. 1823లో పల్డోవ అనె జిల్లా అధికారి (అక్కడ గవర్నర్ అంటారు) ఆఫీసులో గుమస్తాగా చేరాడు. కొంతకాలం తరువాత జార్జియాకు బదిలీ అయ్యాడు. 1830 నుండి 1835 వరకు రెండు జిల్లా పోలీసు అధికారి ఆఫీసుల్లో జర్నలిస్ట్ (క్రైమ్ న్యూస్, శాంతిబద్రతలు గురించి పత్రికలో రాయటం)గా పని చేసాడు. 1840లో జిల్లా పోలీసు అధికారిగా ప్రమోషన్ వచ్చింది.

నికోఫర్ బ్లావట్స్కీ 7-7-1849న హెలెనా (మన బ్లావట్స్కీ)ని వివాహమాడాడు. అప్పటికి ఆమెకు 18 సం॥ కాగా అతని వయస్సు 40 సం॥లు ఈ వివాహం బ్లావట్స్కీ ప్రస్తావించగా, హెలెనా బంధువులు అంగీకరించారని, కాని ఆమెకు ఇష్టం లేదని, ఈ వివాహం తప్పించుకోవటానికి ఆమె మ్యాజిక్‌లు, ఇంద్రజాల విద్యలు నేర్పె వాళ్లతో ఎక్కడికో వెళ్లిపోయి, నాలుగు రోజుల తరువాత వచ్చి ఈ వివాహానికి అంగీకరించిందని అంటారు. తరువాత తన పేరు వెనుక 'బ్లావట్స్కీ' అని భర్త పేరు చేరింది. ఆమె వివాహం విజయ వంతం కాకపోయిన 'బ్లావట్స్కీ' పదాన్ని తన పేరు వెనుక అలాగె ఉంచింది. బ్లావట్స్కీ, అల్కాట్‌తో కలసి 1875లో థియోసాఫికల్ సొసైటీని స్థాపించింది. అంతకు ముందు తన జీవితంలో జరిగిన సంఘటనల గురించి ఎవరికీ చెప్పలేదు. ఆమె స్నేహితుడు A.P.సిన్నెట్, ఆమె జీవిత చరిత్రను

రాయటానికి ముందుకు వచ్చాడు. అతనికి కూడా ఆమె వివరంగా చెప్పలేదు. మన సొసైటీని స్థాపించిన తరువాత ఆమే పేరు ప్రఖ్యాతులు క్రమంగా ప్రపంచం అంతా అలుము కోవటంతో, ఆమెతో పరిచయం ఉన్నవారు బంధువులు, స్నేహితులు, సాటి ప్రయాణికులు రాసిన వ్యాసాలు, ఉత్తరాలు, ఇచ్చిన ఉపన్యాసాలు ఆమె జీవిత చరిత్రను కొంతవరకు మాత్రమే మనకు చెప్పగలుగుతాయి. కొంత మంది ఆమె ఆలోచన విధానం గురించి కూడా రాసారు. ఆమెను చూసిన వారికి 'ఈమె ముఖంలో ఎందుకో నవ్వు అమరదు' అనిపిస్తుంది, ఎందుకంటె నిశీధిలో వెలుగు దివ్వెలా, కష్టాల బాటలో మధుర సవ్వడి లాంటిది ఆమె జీవితం. ఆమె తన అమ్మమ్మకి అమ్మ ఇంటిలోని గ్రంథాలయంలో మాజిక్, అతీతశక్తులు, అద్భుతాలకు సంబంధించిన పుస్తకాలు చదివేదని అంటారు. ఈ ప్రపంచంలోకి సైన్సు టెక్నాలజీలు వెలుగులోకి రాకముందు కాలాన్ని మిడిల్ ఏజ్ (11-14 శతాబ్దాల మధ్య) అంటారు. అంతకు పూర్వం షుమారు 1000 సం॥ మతాలు, రాజకీయాలు బలంగా ఉండేవి. అంతకు పూర్వం (10,000 సం॥) లోహాలు, భాషలు, అగ్ని, చక్రాలు మొ॥వి వెలుగులోకి వచ్చాయి. ఆమె ఇంకా, ఇంకా, ఇంకా పూర్వకాలానికి వెళుతూ ఆలోచిస్తుందని, ఆమె దృష్టిలో ఇల్లు, సంసారం, ధనం అనేవి లేవని కొందరు రాసారు. అలా అయితే ఆమె పెళ్లి, బ్లావట్స్కీతో ఎలా జరిగింది ? దీనికి ఆమె ఎవరికీ సరైన సమాధానం చెప్పలేదు. బహుశ 'తను చేయబోయే ప్రపంచయాత్రకు అతను సహాయ పడతాడు' అని ఆమె ఆశపడి ఉండ వచ్చు. ఆ వివాహం జరిగిన వెంటనే దంపతులిద్దరూ ఒక హిల్‌స్టేషన్‌కు హనీమూన్ వెళ్లారు; రెండు నెలలు న్నారు. ఆ ప్రాంతం ఎన్నో రకాల పూలతోటలకు ప్రసిద్ధి. అక్కడ ఆమె గుర్రపు స్వారీ నేర్చుకుందని ఒకసారి ఆమె పాదం గుర్రం వీపు మీద నుంచి వేలాడే రికాబులో ఇరుక్కుని ఎక్కలేక పడిపోయిందని, దాంతో గుర్రం బెదిరి వేగంగా పరుగులంకించుకుందని, ఆమె తలక్రిందులుగా వేలాడుతూ, తన చేతులకు గట్టి దెబ్బలు తగిలాయని, అలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు చాల మంది చనిపోయారని అదృష్టవ శాత్తు అక్కడే ఉన్న సఫర్ ఆలీ ఇబ్రహిం అనే గుర్రపురౌతు ఆమెను రక్షించాడని, అల్కాట్ ఒక పుస్తకంలో (People from

other Land) వివరించాడు.

మూడు నెలల తరువాత ఆమె, నికోఫర్ బ్లావట్స్కీని పట్టించుకోకుండా ఇంటికి వెళ్లిపోయింది. ఇంట్లోవారు ఆమెను భర్త దగ్గరకు వెళ్లమని చెప్పి చూసారు; కాని ఆమె వినలేదు. ఇంట్లో వారు ఆమెకు ఇద్దరు బంధువులను తోడుగా ఇచ్చి, తన తండ్రివద్దకు పంపారు. కాని ఆమెకు పది సం॥లు ప్రపంచ యాత్ర చేయాలని ఉంది. అందుకే ఆమె తన ఇద్దరి బంధువులను కన్ఫ్యూజ్ చేసి, దారి తప్పించి, తండ్రి దగ్గరకు వెళ్లకుండా అతి ప్రాచీన నగరమైన కాన్‌స్టెంట్‌నోపుల్‌కు బయలు దేరింది. ఈ ప్రపంచం అనె రైలు బండి మొదట ఎలా ? ఎప్పుడు ? ఎందుకు ? మొద లయింది ? అప్పుడు మనుష్యు లున్నారా ? లేకపోతె అప్పుడు ఏముంది? ఇలాంటి ప్రశ్నలకు జవాబు కోసం వివిధ మతాలు, ఆచారాలను పరిశీలిస్తు ప్రపంచ యాత్ర చేయాలనుకుంది. ఆమెకు పశ్చిమ దేశాలలో జవాబు దొరక లేదు. తూర్పు దేశాలలో జవాబు దొరికింది లేదా ఆమె సమస్యకు దగ్గర సమాచారం దొరికింది. ముఖ్యంగా అవి, టిబెట్ దేశంలో సెన్‌జార్ భాషలో ఉన్న, 'ది స్టెంజాస్ ఆఫ్ ధ్యాన్' (The stanzas of Dhyan) అనే పుస్తకం, ఇండియాలో 'మండోకపనిషత్' మరి కొన్ని పుస్తకాలు, ఇంకా చైనాలో 'ది గ్రెట్ సింబల్ ఆఫ్ అల్టిమేటమ్' శ్రీలంకలోని బౌద్ధమతం. టిబెట్‌లోని పుస్తకంలో గ్లోబ్స్, రౌండ్స్, రేసెస్ గురించి వివరంగా పద్యాలు, శ్లోకాల రూపంలో ఉంది. ఇది మన వారాలు, నెలలు, సంవత్సరాలు చూపె క్యాలెండర్ లాంటిది. అంటె ప్రాణం, పదార్థం, ఆత్మ పరిణామ క్రమం అంతా వివరిస్తుంది. మనిషి పుట్టకముందు రూపం, పుట్టిన తరువాత ఏ వయస్సులో ఎలా ఉంటాడు వగైరా సంగతులు ఉంటాయని ఉదాహరణగా చెప్పవచ్చు. దీనిని బట్టి మనం 4వ గ్లోబ్‌లో 5వ రూట్‌రేస్‌లో ఉన్నాము. అంటె భూమి జీవితకాలం వంద సం॥ అనుకుంటె ఇప్పుడు అది 50వ సం॥లో ఉంది. మండకోపనిషత్‌లో 'ఈ ప్రపంచం, విశ్వాత్మకు అసలు మొదలు ఏమిటి అనేది మనిషి ఆలోచనలకు అతీతమైనది, కనీసం ఊహించటానికి కూడ సాధ్యపడదు' అని ఉంది. చైనా వారి సిద్ధాంతం 'ది గ్రేట్ సింబల్ ఆఫ్ అల్టిమేటమ్' ఒక వృత్తాన్ని ఇంగ్లీష్ అక్షరం (S) గీతతో రెండు భాగాలుగా విభజించబడి ఉంటుంది. ఒకవైపు పూర్తిగా నలుపు, కాని అందులో తెల్లని

చిన్న సున్నా ఉంటుంది. రెండవ భాగం పూర్తిగా తెలుపు, కాని అందులో నల్లని చిన్న సున్న ఉంటుంది. దీని అర్థం 'నువు మంచి అనేది పూర్తిగా మంచి కాదు, నువు చెడు అనేది పూర్తిగా చెడు కాదు' ఈ వృత్తం యాంటి క్లాక్‌వైస్‌లో తిరుగుతూ ఉంటుంది. శ్రీలంకలోని భౌద్ధమతం 'సాధారణ జీవితం ఉత్తమం' అని చెబుతుంది. ఈ విధంగా ఆమెకు తూర్పు దేశాల మీద ముఖ్యంగా ఇండియా మీద ఇష్టం కలిగింది. నికోఫర్ బ్లావట్‌స్కీ చనిపోయిన తరువాత, ఆమె 3-4-1875 లో అమెరికాలో మైఖెల్ బెటన్లీ అనె వ్యాపారస్థున్ని వివాహం చేసుకుంది. అప్పుడు ఆమె వయస్సు 44 సం॥లు. ఈ వివాహం కూడా కొన్ని నెలల తరువాత ముగిసింది; తరువాత విడాకులు తీసుకుంది.

ఒకనాడు ఆమె లండన్ వీధుల్లో తిరుగుతుండగా ఒక వింత సంఘటన జరిగింది. ఆ రోజు ఆమె 20వ పుట్టిన రోజు (12-8-1851). ఇండియాకు చెందిన ఒక రాజకుటుంబ యువ రాజులు, యువరాణులు ఏదో సాంప్ర దాయక వార్షికోత్సవం చేస్తూ ఊరేగింపు గా మంది మార్బలంతో వెళుతున్నారు. అందులో ఒక వ్యక్తి ఆరడుగుల మూడంగుళాల ఎత్తుతో రాజఠీవిగా ఉన్నాడు. బ్లావట్‌స్కీ అతన్ని చూడగానె, ఆగి, జాగ్రత్తగా పరిశీలించింది. తనకు ఊహల్లో కనిపించె 'తన జీవిత మార్గ నిర్దేశకుడు అతనె' అని నిర్ధారించుకుంది. ఆ ఊరేగింపులోకి జొరబడి అతనితో మాట్లాడాలనుకుంది, కాని కుదరలేదు. తరువాత రోజున అదే ప్రాంతంలో ఒక పార్కులో కూర్చుని తదేకంగా ఆలోచిస్తుండగా, సదరు వ్యక్తి ఆమెకేసి పెద్దపెద్ద అంగలతో నడుస్తూ వచ్చాడు. ఇద్దరు కొద్దిసేపు ఆధ్యాత్మిక విషయాలు, మతాలు, ఆచారాలు గురించి మాట్లాడు కున్నారు. మాటల సందర్భంలో అతను "మానవ అభ్యుదయానికి ఒక ఉద్యమం మొదలుపెట్టాము. అందుకు మీ సహకారం అవసరం. అందులో భాగంగా మీరు టిబెట్, ఇండియాలకు వెళ్ళి రావలసి ఉంటుంది" అన్నాడు. అప్పుడే బ్లావట్‌స్కీ గ్రహించింది 'తనకు ఎప్పటి నుంచో ఊహల్లో కనిపిస్తున్న తన మార్గ నిర్దేశకుడు  అతడే' అని. కాని అప్పటికప్పుడు ఆమెకు ఇండియా వెళ్లాలనుకోలేదు. ఆమె ప్రపంచయాత్ర కోసం ఒక క్రమం నిర్ణయించుకుంది. కొద్దిరోజుల్లోనె ఆమె తన యాత్ర, లండన్ నుంచి ప్రారంభించింది.

(సశేషం)

# విశ్వశాంతి స్థాపన

**– కీ.శే. సో. పాణ్యం రామనాథశాస్త్రి**

"ఓం సహనావవతు, సహనౌ భునక్తు, సహవీర్యం కరవావహై, తేజస్వీ నావధీతమస్తు, మావిద్విషావహై, ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః". ఈ శాంతి మంత్రము పలువురకు సుపరిచితమైనది. ఈ మంత్రం భావము ఏమన, గురు శిష్యులమైన మామధ్య సహనము ఉండు గాక! మేమిద్దరము అధ్యయనాన్ని సహన భావంలో నెరవేర్తుముగాక! తత్ఫలితంగా మేము వీర్యవంతులము తేజోవంతులము అగుదుముగాక! మాలో పరస్పరం ద్వేషభావం లేకుండనుండుగాక? 'శాంతి శాంతి శాంతిః' అని మూడుసార్లు ప్రస్తావించుటలో శారీరకమైన దుఃఖము కలుగకుండుగాక (ఆధి భౌతిక) మరియు అతివృష్టి, అనావృష్టి కరువులు, కాటకాలు, భూకంపాలు మొదలగు ప్రకృతి విపరీతములవలన ఎటువంటి ఇబ్బందులు(ఆధిదైవిక) కలుగకుండు గాక.

పైన పేర్కొన్న అంశాలన్ని అశాంతిని కలిగించేవి. సమస్త ప్రపంచము ఈ బాధలనుండి రక్షింపబడి, శాంతిని పొందుగాక! అని సద్భావపరంపరలు, అధ్యయనం చేసేవారు సర్వప్రపంచానికి, ప్రసరింపజేస్తారు.

మూలమంత్రములో అశాంతిని కలుగజేసే మొదటి అంశము– 'అసహనము'. ఇతరుల భావాలను, వారి ప్రవర్తనను, వారి ప్రగతిని చూచి అకారణంగా ఓర్వజాలకుండుట, అసహనము కామక్రోధ మదమాత్సర్యా లనే అరిషడ్వర్గాలలో 'మత్సరము' అనేది చివరిది. ఇదే అసహనము. కామ క్రోధాదులన్నిటికి మూలము 'మత్సరము' అని కొందరు విజ్ఞులభావము. దుర్యోధనుడు సద్గుణవంతుడే అతన్ని సుయోధనుడనికూడ అంటారు. కాని పాండవుల యెడ మత్సరగ్రస్తుడగుటచే సర్వనాశనాన్ని పొందినాడు. ఒకే కుటుంబములో భార్యా భర్తలు, అక్క చెల్లెండ్లు, అన్నదమ్ములు మత్సరగ్రస్తులై అనేక కడగండ్లపాలైన ఉదంతాలు కోకొల్లలుగ చరిత్రలోను నిత్యజీవితం లోను చూస్తున్నాము,

ఈ అసహనానికి (మత్సరానికి) మూలము, దేహాత్మభావము. దేహాత్మ భావమే భేదభావాలకు కారణము. నేను

వేరు ఇతరులు వేరు అనేది భేదభావాలకు కారణము. ఈ భేదభావానికి కారణము అజ్ఞానము లేక అవిద్య, సృష్టిలోని అందరు భగవదంశలు (మమైవాంశో జీవలోకే) అంటుంది భగవద్గీత. ఇది పరమ సత్యము. "ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కడై తోచుపోలికా". ఒకే పరమాత్మ వేరువేరు ఉపాధులలో వేరు వేరుగా, అనేకంగా ఉన్నట్లు అగుపిస్తున్నాడు. ఉదాహరణకు అనేకమైన మట్టిపాత్రలలోని నీళ్ళలో సూర్యుడు వేరువేరుగనున్నట్లు అగుపిస్తున్నాడు. ఇది భ్రమ. ఇదే అవిద్య. మట్టి పాత్రలను పగలగొట్టితే, ఉండేది, కనబడేది, ఒకే సూర్యుడే. కనుక నేను, నీవు, వాడు, అది అనే విభేధాలు అజ్ఞానంవలన కలిగిన భ్రమ. దీన్నే అవిద్య అంటారు. దు:ఖ కారణములుగా చెప్పబడే పంచకేశాలలో మొదటిది అవిద్య అంటాడు పతంజలి మహర్షి. (అవిద్య, అశ్మిత, రాగ, ద్వేష, అభినివేశములు పంచకేశములు). కనుక అసహనానికి మూలము అవిద్య. అవిద్య వలన నేను, నీవు అస్మితాభావం వస్తుంది. దీనివలననే రాగద్వేషాలు జనిస్తాయి.

ఈ అజ్ఞాన ప్రభావంలోనే మతాలు, కులాలు, జాతులు, స్త్రీ, పురుష లింగ భేదాలు వ్యక్తమవుతాయి. ఏజాతి అయితే నేమి, ఏమతమైతేనేమి, అందరు భగవదంశలైన మానవులే అనే సత్యాన్ని మరిచి ప్రవర్తించుటే అశాంతికి కారణం.

మతాలన్నింటిని ద్వేషిస్తూ, మతం అని పేరుచెపితే ప్రాణాలు పోతూండేవి. ఒకానొక దేశంలో, భూమి సూర్యుని చుట్టూ తిరుగుతుంది అనే సత్యాన్ని వెల్లడించిన శాస్త్రజ్ఞుని, ఆనాటి మత పెద్దలు దైవద్వేషి అని, సజీవంగా అగ్నికి ఆహుతిచేశారు. శివుడు గొప్ప అని శైవులు, విష్ణువు గొప్ప అని వైష్ణవులు, ఒకరినొకరు ద్వేషించు కున్నారు. 'శివాయ విష్ణురూపాయ, శివరూపాయ విష్ణవే' అనే సత్యాన్ని తెలుసుకుంటే, భేదభావాలు, అసహనాలు సమసిపోతాయి. శాంతి సుప్రతిష్టిత మవుతుంది. కనుక లోకంలో అశాంతికి కారణం అవిద్య లేక అజ్ఞానం. అవిద్య పోతే అసహనానికి చోటేలేదు.

వ్యక్తిగత అశాంతికి ఏదికారణమో, అదే అంతర్జాతీయ రంగంలో, అశాంతికి కారణము. ఇక్కడ వ్యక్తుల స్థానంలో ప్రభుత్వాలుంటాయి.

వ్యక్తిగతంగా అసూయ అశాంతికి కారణము. అట్లాగే లోభంకూడ అశాంతికి కారణము. కొందరు తామే గొప్ప అని, బడుగులను తమ చెప్పుచేతుల్లో వుంచు కోవాలి అనే అధికారదర్పంతో వారి త్వరితగతి పురోగమనాన్ని సహించ

లేకున్నా, తమ పాశవిక బలంతో వారి వెండలువంచి, వారిని తమకు అనుకూలంగా మలుచుకొని అధికారము సర్వకాలాల్లో తమ చేతుల్లో వుండాలనే భావంతో ఉన్నాయి. ఇది అధికార లోభం కలవారి ద్వంద్వనీతి. ఇది అంతమయి నప్పుడే విశ్వశాంతి స్థాపన జరుగుతుంది.

శాంతిస్థాపన జరగాలంటే మానవుల్లో మౌలికమైన మార్పురావాలి. మౌలికమైన మార్పురావాలంటే ప్రజలు అజ్ఞానాంధకారం నుండి బయటపడాలి. వివేకవంతులు, విజ్ఞానవంతులు కావాలి. విజ్ఞానాన్ని, హృదయ వికాసాన్ని పొంద జేసే విద్య నేర్పించాలి. సర్వాత్మనాభావం సమతా దృష్టి అంటే బ్రహ్మదృష్టి, ఆత్మదృష్టి, సర్వభూతాల్లో, పరమేశ్వరుడు నిగూఢంగా వున్నాడనే ఆధ్యాత్మదృష్టి పెంపొందాలి. పొరుగువారిని ప్రేమించు' 'ఒక చెంప కొట్టితే మరొక చెంప చూపించు' 'ఇతరులు నీ యెడ ఎట్లా ప్రవర్తించాలని కోరుతావో, ఆవిధముగా నీవు ఇతరుల యెడ ప్రవర్తించు' అనే బోధనలు ఆచరణలోనికి రావాలి.

**ఒరులేవియు నొనరించిన,**
**వరవర, అప్రియంబు తనమనంబునకగు**
**నొరులకవి సేయకునికి**
**పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్**
**అనే సూక్తి ఆచరణాత్మకము కావాలి.**

ఈ పద్ధతి ఆచరణలో పెట్టినపుడు సమాజములో అనాగరికత తప్పక తగ్గుతుంది. ఆత్మీయత సోదరభావం, పరోపకార పారీణత అభివృద్ధి నొందుతాయి. సౌమ్యసహజీవనం, శాంతి సౌఖ్యాలు వెల్లివిరిస్తాయి. ఈ సూత్రాలు ఆచరణలో పెట్టినపుడు విశ్వశాంతి చేకూరుతుంది. ఆత్మీయతతో కూడిన జీవనమే ఆధ్యాత్మజీవనం.

(2007 దీపిక సంచిక నుండి)

---

**(ధరణిని ధరించేతత్త్వమే - ధర్మం! 6వ పేజీ తరువాయి..)**

ఒక్కటే. అదే విశ్వధర్మం. ధర్మానికి గీటురాయి 'అంతర్ముఖత్వం'. ధర్మం భూమాత ఐతే, మతాలూ, సంప్రదాయాలు విభిన్న భూమార్గాలవంటివి. వీటిలో ఏదీ భూమి కాలేదు. .... ధర్మమే భూమి. అది మార్పు చెందటం లేక నశించటమంటే ప్రళయమే! ధరణిని ధరించే తత్త్వమే ధర్మం. ధర్మం చాటుమాటుగానే అధర్మం మనగలదు. కానీ, తనకు తానుగా బతికి బట్టకట్టలేదు. అధర్మాన్ని పట్టుకున్న వాడికి పతనం తప్పదు! 'ధర్మో రక్షతి, రక్షితః' – ధర్మాన్ని కాపాడి మనల్ని మనం కాపాడుకుందాం.

# మార్మికయోగి మహాత్మా కబీరు

– శ్రీ పరికిపండ్ల సారంగపాణి,
హన్మకొండ, సెల్ : 9849630290

కబీరుదాసు 15వ శతాబ్దపు హిందీసాహిత్యంలోని భక్తి యుగానికి చెందిన ప్రజాకవి, ఆధ్యాత్మికవేత్త, సంఘసంస్కర్త, గొప్ప రామభక్తుడు. తనదైన శైలిలో భక్తితత్త్వం బోధించిన నిర్గుణభక్తి శాఖ ప్రతినిధి. కబీర్ పంత్ అనే సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన ప్రవక్త. హిందూముహమ్మదీయుల ఐక్యతకై శ్రమించిన కర్మయోగి.

కస్తూరీ మృగం తనలో ఉన్న పరిమళాన్ని గుర్తించలేక ఆ పరిమళం కోసం అడివంతా గాలించినట్టుగా మానవుడు తన ఆత్మలోని పరమాత్ముని గ్రహించలేక ఆ దేవదేవుని కోసం వెదుకుతూ అనేక తీర్థయాత్రలు చేస్తాడని కబీరు బోధిస్తాడు. మానవత్వాన్ని మరిచి మతాల పేరిట సమాజంలోని సామరస్యాన్ని చెడగొట్టడం అవివేకం అనేది ఆయన అభిప్రాయం. సజ్జన సాంగత్యం మానవునికి మహోపకారం చేస్తుందంటాడు. కష్టాల్లో ఉన్నప్పుడు మాత్రమే భగవంతుణ్ని తలుస్తారు. సుఖాల్లో ఉన్నప్పుడు ఎవరూ తలవరు. సుఖాల్లో ఉన్నప్పుడుకూడా ఆయన్ని తలిస్తే దుఃఖాలెందుకు వస్తాయి అని కబీరు ప్రశ్నిస్తూ ఎన్నో జీవిత సత్యాలు దోహాల రూపంలో చెబుతాడు.

కబీరుదాసు జన్మవృత్తాంతాన్ని గురించి ప్రచారంలో ఉన్న కథ – కాశీలో నివసించే బ్రాహ్మణ విధవ, రామానందుడు అనే వైష్ణవ ఆచార్యుని ఆశీస్సులతో గర్భందాల్చి మగబిడ్డను కంటుంది. సమాజానికి జడిసిన ఆమె ఆ పసికందును లహర్తారా అనే చెరువుగట్టు మీద విడిచి వెళ్తుంది. ఆ దారిగుండా వెళ్ళే నీరూ – నీమా అనే ముస్లిం చేనేత దంపతులు ఆ బిడ్డను చూసి సంతానం లేని తమకు భగవంతు డిచ్చిన ప్రసాదంగా భావించి ఆ బిడ్డను ఇంటికి తీసుకువెళతారు. తమ సంప్రదాయం ప్రకారం కబీరు (గొప్ప జ్ఞాని) అని పేరు పెడ్తారు. ఉన్నంతలో అల్లారు ముద్దుగా పెంచి పెద్దచేస్తూ తమ వృత్తిని నేర్పిస్తారు. కబీరు బట్టలు నేస్తూ వాటిని అమ్మగావచ్చే అతికొద్ది డబ్బుతో వృద్ధులైన తల్లిదండ్రులను పోషిస్తుంటాడు. అక్షరజ్ఞానం కోసం అతడు ఎక్కడికీ వెళ్ళలేక, తీరికవేళల్లో దగ్గరుండే సాధుసంతులతో సత్సంగంలో కూర్చుండే

వాడు. ఆ సజ్జనసాంగత్యంతో భౌతిక, పారమార్థికజ్ఞానం పొందుతాడు. అప్పుడప్పుడు దూరప్రాంతాలకు వెళ్ళి మహాత్ములను కలుస్తూ తన సంశయాలను తీర్చుకునే ప్రయత్నం చేస్తుండేవాడు. ఆ సందర్భంలోనే భద్రాద్రిలో భక్త రామదాసును కలిసి మహా మహిమాన్వితుడైన రామచంద్ర ప్రభువు గురించి ఆయనతో చర్చించి కొత్త విషయాలు తెలుసుకునేవాడని చెబుతారు.

పెళ్ళీడు వచ్చిన కబీరువివాహం బన్‌ఖేడి బైరాగి కూతురు "లోయి"తో జరుగుతుంది. లోయి శీలవతి, గుణవతి భర్త అడుగు జాడల్లో నడిచే పరమసాధ్వి. వీరికి ఇద్దరు పిల్లలు, కొడుకు కమాల్, కూతురు కమాలి, కమాల్ యుక్త వయసులో తండ్రితో పడక ఇంటి నుంచి వెళ్ళిపోతాడు. కబీరుఇంట్లో రోజూ జరిగే అతిథి సత్కారాలు, దానధర్మాలు కుటుంబాన్ని ఆర్థికంగా దిగజారుస్తాయి. అయినా కబీరులో ఎలాంటి మార్పు కనిపించేది కాదు. ఉత్తమ ఇల్లాలయిన లోయి అప్పులు చేస్తూ భర్త గౌరవానికి ఏ లోటురాకుండా చూసుకుంటుండేది. ఓ రోజు కబీరు ఇంటికి పదిమంది అతిథులు వస్తారు. ఆతిథ్యానికి తగు ఏర్పాట్లు చేయవల్సిందిగా భార్యతో కబీరు చెబుతాడు. ఆ సమయంలో ఇంట్లో వస్తువులన్నీ నిండుకుంటాయి. చేతిలో చిల్లిగవ్వ ఉండదు. బయట అప్పు పుట్టే పరిస్థితీలేదు. చివరకు లోయి భర్త గౌరవాన్ని కాపాడేందుకు తన శీలాన్ని పణంగా పెట్ట సిద్ధపడుతుందట.

ఆ రోజుల్లో ప్రతి ఒక్కరు మంచి గురువు వద్ద ఉపదేశం పొందడం కోసం ఆరాటపడుతూండేవారు. గురూపదేశంతోనే జీవితం ధన్యమవుతుందని భావించేవారు. ఆ కాలంలో రామానందుడే మంచి పేరున్న గురువు. ఆయన వద్దే దీక్ష తీసుకోవాలని తాపత్రయపడేవారు. కబీరుకూడా రామానందుని ఆశ్రయిస్తాడు. అయితే రామానందుడు కబీరును శిష్యునిగా స్వీకరించ ఇష్టపడడు. దృఢ నిర్ణయం చేసుకున్న కబీరు, రామానందుడు రోజూస్నానానికి వెళ్ళే మెట్ల మీద పడుకుంటాడు. తెల్లవారుజాము చీకటి కారణంగా గంగానదిమెట్లమీద పడుకున్న కబీరును రామానందుడు గమనించడు. మెట్లు దిగేటప్పుడు రామానందుని కాలుకు కబీరు శరీరం మెత్తగా తగులుతుంది. రామ్...రామ్ అంటూ జాగ్రత్తగా పక్కకు జరిగి గంగానదిలో దిగి స్నానం చేస్తుంటాడు. తనకు రామనామాన్ని ఉపదేశించినది రామానందుడేనని, ఆయనే గురూపదేశం చేసాడని కబీరు అందరితో చెబుతుంటాడు. ఈ విషయాన్ని రామానందునికి ఆయన శిష్యులు

చేరవేస్తారు. ఒక రోజు రామానందుడు కబీరును పిలిపించి, "నువ్వు నా శిష్యునిగా ఎప్పుడయ్యావు? నేను నీకు రామనామాన్ని ఎప్పుడు ఉపదేశించాను?" అంటూ కోపంతో ఊగిపోతూ కాలినున్న పాదుక తీసి "రామ్.. రామ్" అని గద్దిస్తూ కబీరు నెత్తిమీద ఒక్కటేస్తాడు. అప్పుడు కబీరు, "గురుమహరాజ్, తబ్ కీ దీక్షా ఝూత్ హేతోఁ అబ్ కీ దీక్షా సచ్..." (అప్పుడు, రామనామంతో యిచ్చిన దీక్ష అబద్ధమైతే ఇప్పుడదే రామనామంతో ఇచ్చింది నిజమేకదా) అంటాడు. ఇది తనకు జీవితంలో మరపురాని సంఘటనగా చెబుతూ" సత్ గురు రామానంద్ కియా మహా ఉపకార్" అని చెబుతాడు కబీరు.

ఆదిశంకరులవలె కబీరూ అద్వైత సిద్ధాంతాన్ని నమ్మి ఏకేశ్వరోపాసననే విశ్వసించేవాడు. ఆయన ఆరాధ్యదైవం దశరథ రాముడు కాదు. సచ్చిదానందుడు, మర్యాదాపురుషోత్తముడైన శ్రీరామ చంద్రుడు. కబీరుదాసు నిర్గుణరాముని భక్తుడు. అంటే ఆయన రాముడు రూపధారి రాముడు కాదు. ఆయన నామమే భగవంతుడని కబీరు అభిప్రాయం. అందుకే 'నిర్గుణరామ్ జప్ రేభాయి' అంటుండేవాడు కబీరు. భగవంతునికి ఆకారాన్నిచ్చి పూజించడం కూడదని వ్యంగంగా చెప్పిన పద్యం చాలా ప్రసిద్ధి – పాహన్ పూజే హరీమిలై మై పూజులపహర్, సబ్ సే యహ చక్కీ భలీ పీస్ ఖాయ్ సంసార్ – అణువణున నిండి ఉన్న పరమాత్ముని రూపాన్ని రాయికి రప్పకు ఇచ్చి పూజించడమేమిటి? అలాగైతే నేను ఓ కొండనే పూజిస్తాను. భగవంతుడు నిరాకారుడు. పూజ చేయాలనుకుంటే పేదలకు ఉపయోగపడే విసుర్రాయిని పూజించండి అంటాడు. కబీరుదాసు సనాతన ధర్మాన్ని, వేద జ్ఞానాన్ని ప్రేమించే వాడు. ఆయన దృష్టిలో రాముడైనా, రహీం అయినా ఒక్కటే! అందుకే హిందువులను మహమ్మదీయులను సమంగా చూసే వాడు. ఏమతం ఇతర మతాలను ద్వేషించమని చెప్పలేదంటుండేవాడు. అందరు ఒకరిపై ఒకరు ప్రేమ కనబరుస్తూ మెలగాలని బోధించేవాడు.

కబీరుదాసు గురువును భగవంతుని కంటే ఎక్కువ ఆరాధించేవాడు. గౌరవించే వాడు - గురు గోవింద్ దోవూ ఖడేఁ కాకే లాగూఁ పాయ్, బలిహారి గురు ఆపునో గోవింద దియో బతాయ్" గురువు, భగవంతుడు ఒకేసారి ప్రత్యక్ష మైతే, నేను గురువుకే మొదట పాదాభి వందనం చేస్తాను. ఎందుకంటే ఆయన దయవల్లే నాకు భగవంతుని గురించిన జ్ఞానం కలిగింది అంటాడు. మరో

సందర్భంలో గురువును గొప్పగా వర్ణిస్తూ" భగవంతుడు కినుక వహిస్తే గురువును ఆశ్రయించి తరుణోపాయం ఏమిటో తెలుసుకోవచ్చు. మరి గురువే మన మీద అలిగితే ఇంక మనకు దిక్కెవరు" అంటాడు కబీరు.

మహాత్మగాంధీకి కబీరన్నా ఆయన బోధనలన్నా ఎంతో గౌరవం. కబీరుదాసు వలెనే చెప్పడం కంటే చేయడమే ఇష్టపడే వాడు గాంధీ. సత్యాన్ని గురించి కబీరు చెప్పిన పద్యం – సాంచ్ బరాబర్ తప్ నహీం ఝూత్ బరాబర్ పాప్, జాకే హిరదయ్ సాంచ్ హైం, తాకేహిరదయ్ ఆప్, ఈ ప్రపంచంలో సత్యాన్ని మించిన తపస్సు, అసత్యాన్ని, మించిన పాపం ఏదీ లేదు. ఎప్పుడూ నిజాన్ని చెప్పే వారి మనసులోనే భగవంతుడు కొలువై ఉంటాడు'' అనే భావాన్ని మాటల సందర్భంలో మహాత్ముడు వాడేవాడు. గాంధీ మహాత్ముడు పాడే ప్రార్థనాగీతం – ఈశ్వర్ అల్లాతేరేనామ్, సబ్ కో సన్మతి దే భగవాన్ ప్రేరణ కబీరుదాసే అంటారు. మహాత్ముడు కూడా కబీరువలె అద్వైత సిద్ధాంతాన్ని, నిరాకార రాముడ్ని నమ్మేవాడు.

కబీరు ఏంచెప్పినా ప్రజల నైతికతకు, మూఢ నమ్మకాలు దూరంచేయడానికి చెప్పాడుతప్ప సాహిత్య సృజన కోసం కాదు. ఆయన చెప్పిన విషయాలన్నిటినీ ఆయన ప్రియ శిష్యులు భోగదాసు, రామదాసు లిపి చేసినట్టు పరిశోధకులు చెబుతున్నారు.

మనం ఏ పనిచేసినా మనస్సును నియంత్రిస్తూ చేయాలంటాడు కబీరు. చాలామంది భగవన్నామస్మరణ యాంత్రి కంగా చేస్తుంటారు. అలాంటివారి గురించి – "మాలాతో కర్ మే ఫిరై జీభ్ ఫిరై ముఖ్ మాతాం, మన్‌వాతో చుహుం విసి ఫిరై యహ్ తో సుమిరన్ నాహీ" – చేతిలో జపమాల తిరుగుతుంటుంది. నాలుక భగవాన్నామస్మరణ చేస్తుంటుంది. కానీ, మనసేమో కనిపించే అన్ని వస్తువులపై దృష్టి పెడుతుంది. ఇది భగవన్నామస్మరణ అనుపించుకోదు అంటాడు కబీరు.

సజ్జనులు నైతికగుణాలు కలిగి ఉండాలి. మంచిని గ్రహించి చెడును విడవాలని చెప్పిన పద్యం 'సాధు ఐసా చాహియే జైసే సూప్ సుభాయ్ సార్ సార్‌కో రహీ రహే ధోధాదేయ్ ఉడాయ్'.

పరోపకారం లేకుండా ఎంత ఎదిగినా ఏం లాభం అనే భావంతో "బడా హువ్వాతో కాల్గిహువా జైసే పేడ్ ఖజూర్, పంధీ కో ఛాయా నహీం ఫల్ లాగై అతి దూర్" – చూడడానికి ఖర్జూరపు చెట్టు ఏపుగా ఉంటుంది. కాని, దాని పళ్ళు

అందనంత దూరంలో ఉంటాయి. పైగా అది బాటసారులకు ఎంతమాత్రం నీడనీయదు.

తృప్తికరమైన జీవితం జీవించేటంత ధనం మాత్రమే కోరుకోవాలి మనిషి. అంతకంటే ఎక్కువధనం ఉంటే, భగవంతుణ్ణి మరిచిపోయే ప్రమాదం అనే అభిప్రాయంతో చెప్పిన పద్యం – సాయీఁ ఇతనా దీజీయే జామే కుటుంబ్ సమాయ్, మైభీ భూఖానా రహూఁ న సాధూ భూఖా జాయ్ భగవాన్, నేను నా కుటుంబాన్ని పోషించుకుంటూ నా ఇంటికి వచ్చే అతిథులకు ఆతిథ్యం ఇచ్చే అంతధనం మాత్రమే ప్రసాదించు అంటాడు కబీరు.

మనిషి గుణాలన్నింటికంటే మిన్నయైన సుగుణం శీలం. ఇది ప్రపంచంలోని సిరిసంపదలకంటే గొప్పది అంటూ కబీరు" శీలవంత్ సబ్సే బడా, సబ్ రతన్ ధన్ ఖాన్, తీన్ హోర్ కీ సంపదా రహీ శీలమేఁ ఆన్" అంటాడు.

కబీరుదాసు బోధనలో సనాతన ధర్మానికి సంబంధించిన సంస్కృతీ సంప్రదాయాలు ఉంటాయి. కబీరు ఆచరణాత్మక వ్యక్తి. ఆచరించగలిగిన వాటినే చెబుతాడు. చెప్పేవాటిని ఆచరిస్తాడు. అందుకే ఆయన మాటలకు చాలా విలువ ఇస్తారు. విమర్శకులు.

కబీరు రచనల్లో రామాయణ భారత భాగవత భగవద్గీత ల్లోని విషయాలు ఉదాహరణగా అక్కడక్కడ ప్రస్తావించినట్టు పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.

రామాయణంలో రావణుడు పరస్త్రీ పొందుకోరడంవల్లే ఆయన పదితలలు పోయాయి అంటాడు. భారతంలోని కృష్ణుని 'భజరే మధుసూదన్ హరి' అని కబీరు పేర్కొన్నట్టు చెబుతారు. భాగవతం లోని ప్రహ్లాదుని పేరునీ ఉదహరించినట్టు చెబుతారు. భగవద్గీతలో 17వ అధ్యాయం 15వ శ్లోకంలో, ఇతరులతో మాట్లాడే మాటలెలా ఉండాలో కృష్ణపరమాత్ముడు చెప్పినదాని భావానికి అద్దంపట్టే విధంగా కబీరు "బోలీ ఏక్ అన్ మోల్ హై జోకోయీ బోలే జానీ, హియ తరాజు తోల్ కే తబ్ ముఖ్ బాహర్ ఆనీ" మనం ఇతరులతో మాట్లాడే మాటలు, హృదయం అనే త్రాసులో తూచి మాట్లాడాలి అంటాడు.

కబీరుదాసు యదార్థవాది, యుగ పురుషుడు. తన బోధనలతో కేవలం భారతీయులనే కాదు. ప్రపంచ ప్రజలను సైతం ఆకర్షించాడనడంలో సందేహం లేదు.

(సుపథ సౌజన్యంతో..)

# వార్తలు - విశేషాలు

**గుంటూరు :**

శ్రీకృష్ణదివ్యజ్ఞాన సమాజం, గుంటూరులో మే 8, 2020వ తేదీన "శ్వేత పద్మదినం" జరుపుకున్నారు. కరోనా కారణంగా సభ్యులందరూ తమ తమ ఇళ్ళ వద్ద నుండే హెచ్.పి.బ్లావెట్స్కీని స్మరించుకున్నారు. అనంతరం దివ్యజ్ఞాన సమాజ ముఖ్య గ్రంథాలైన వాయిస్ ఆఫ్ సైలెన్స్, లైట్ ఆఫ్ ఏషియా మరియు భగవద్గీత నుండి కొన్ని పంక్తులను పఠించారు.

ఈ సందర్భముగా ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా గుంటూరులోని మానవతా సేవా సమితి వారి వృద్ధాశ్రమానికి రూ.1,900/- విరాళం అందించారు.

శ్రీకృష్ణదివ్యజ్ఞాన సమాజం TOS లో భాగంగా మార్చి 18, 2020వ తేదీన రూ.10,000/-లు, "మాస్కులు" తయారు చేసి అవసరార్థులకు విరాళంగా ఇచ్చే "యోగద ఛారిటబుల్ ట్రస్ట్" వారికి ఇవ్వడం జరిగింది. అలాగే మార్చి 30వ తేదీన వరంగల్‌లో నూతనంగా ప్రారంభింపబడిన "స్ఫూర్తి జ్యోతి దివ్యజ్ఞాన సమాజం" వారికి రూ.3,000/- విరాళంగా ఇవ్వడం జరిగిందని సమాజ కార్యదర్శి దీపికకు తెలియజేసారు.

**రాజమహేంద్రవరం :**

మార్చి 1, 2020వ తేదీన రాజమండ్రి దివ్యజ్ఞాన సమాజము నందు IB hubbs అను పేరు గల సంస్థ ఒక పవర్ పాయింటు ప్రజంటేషన్ వర్క్ షాప్ నిర్వహించి "ఫైనాన్సియల్ అండ్ రీసెర్చ్ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ గురించి చక్కగా వివరించారు.

మార్చి 8వ తారీఖున "పరమగురు చరణ సన్నిధి" అనే గ్రంథము నుండి 1-3వ అధ్యాయము వరకు శ్రీ కె.వి.గోపాలకృష్ణగారు అధ్యయనం చేయించారు.

మార్చి 15వ తారిఖున "పరమగురు చరణ సన్నిధి" నుండి 1-4 నుండి 1-7 అధ్యాయం వరకు శ్రీ కె.వి. గోపాలకృష్ణ గారు సభ్యులకు వివరంగా తెలియజేసారు.

మార్చి నెల చివరి వారము నుండి కరోనా వైరస్ ప్రభావము వలన ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధ్యయన తరగతులు నిలిపివేయడమైనదని దీపికకు

తెలియజేసినారు.

**బళ్ళారి :**

సన్మార్గా దివ్యజ్ఞాన సమాజం వారు మార్చి 1వ తేదీన "C.W. లెడ్ బీటర్" పుణ్యతిథిని జరుపుకున్నారు. సో.కె.ఎమ్. శివకుమార్ లెడ్ బీటర్ జీవిత చరిత్రను వారు సాధించిన సిద్ధుల గురించి సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమానికి సుమారు 40 మంది సభ్యులు హాజరైనారు. కార్యక్రమాన్ని ప్రసాద వితరణతో ముగించారు.

మార్చి 8, 2020వ తేదీన "ఆత్మ సంస్కృతి" అను అంశంపై అధ్యయన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా॥ ఎ.ఐ.బసవరాజారెడ్డి, శ్రీ రంగయ్య శెట్టి, శ్రీ హనుపన్న మరియు శ్రీ టి.రాజేంద్రప్ప తదితరులు ప్రసంగించారు.

సుమారు 100 మంది సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరుకాగా వారికి అల్పాహార, భోజన సదుపాయములు ఏర్పాటు చేసినామని సమాజ కార్యదర్శి శ్రీ ఎమ్.చంద్రశేఖర్ దీపికకు తెలియజేసారు.

**శ్రీకాకుళం :**

శ్రీకాకుళం జిల్లాలోని వివిధ దివ్యజ్ఞాన సమాజములలో ఈ క్రింది సమాజ సభ్యులు పరమపదించారు.

సంతవురిటి గ్రామ దివ్యజ్ఞాన సమాజ సభ్యురాలు సోదరి చల్లా లక్ష్మీకాంతం గారు (డి.నెం.73139) 18-4-2020వ తేదీన పరమపదించారు. వీరికి 75 సంవత్సరములు.

23-5-2020వ తేదీన సమాజ సభ్యులు సో॥ బొంగు పాపారావు గారు (డి.నెం.70139) స్వర్గస్తులైనారు. (75 సం॥)

వీరి ఆత్మకు శాంతి కలగాలని సభ్యులు నివాళులర్పించారు.

**తెలుగు ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన దివ్యజ్ఞాన సమావేశములు :**

గోదావరి దివ్యజ్ఞాన సమాజం వారు Zoom ద్వారా ఈ క్రింది అన్‌లైన్ సమావేశములు నిర్వహించారు.

ది.5-4-2020వ తేదీన సాయంత్రం 5 గం॥ల నుండి 6 గం॥ల వరకు "దివ్యజ్ఞాన కోడ్ - ప్రస్తుత పరిస్థితి" అను అంశంపై సో॥ కె.ఎస్. రామచంద్రరావుగారు, తెలుగు ఫెడరేషన్ అధ్యక్షులు ఉపన్యసించారు.

ది.11-4-2020వ తేదీన గోదావరి దివ్యజ్ఞాన సమాజం స్థాపించి 87 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సా॥ 5 నుండి 6 గం॥ల వరకు సంస్థాపన దినోత్సవ సమావేశం ఏర్పాటు చేసారు. "గోదావరి దివ్యజ్ఞాన చరిత్ర మరియు ప్రాముఖ్యత" అను అంశంపై సో॥ కె.ఎస్.రామచంద్రరావుగారు ఉపన్యసించారు.

ది.22-4-2020వ తేదీన సా॥ 5 గం॥లకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా "ఎర్త్‌డే 2020" అనుఅంశంపై శ్రీ కె.ఎస్.రామచంద్ర రావుగారు ఉపన్యసించారు.

ది.8-5-2020న బ్లావెట్స్కీ వర్ధంతి సందర్భంగా "శ్వేతపద్మ దినం" జరుపుకున్నారు. ఈ సందర్భంగా "బుద్ధుని చరిత్ర, మౌనవాణి, భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తియోగం" అను అంశములపై సో॥ లక్ష్మి గారు (వైజాగ్) సో॥ భాగ్యలక్ష్మిగారు (నరసాపురం) ప్రసంగించారు.

## సమాజ కార్యదర్శులు, రచయితలకు మనవి

దివ్యజ్ఞాన దీపిక ట్రస్టు e-mail id ప్రారంభించినది. కావున మీ వ్యాసములు, మీ లాడ్జికి సంబంధించిన వార్తలు-విశేషాలు, ఫొటోలు e-mail id (deepikatrust1910@gmail.com) కి పంపగలరు.

ఇట్లు

**కార్యదర్శి, దీపిక ట్రస్టు.**

## జన్మదిన శుభాకాంక్షలు



దివ్యజ్ఞాన సమాజము, తెలుగు సమాఖ్య కార్యదర్శి సోదరులు శ్రీ జి. సుబ్రహ్మణ్యం గారి మనుమరాలు, డా॥ జి.వి.మహేష్ పుత్రిక అయిన కుమారి **డింపుల్ సుప్రియ** పుట్టినరోజు జూన్ 28న జరుపుకొన్న సందర్భముగా దీపిక ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నది.